సాక్షి
అనకాపల్లి

శుక్రవారం | 27 | అక్టోబర్ | 2023



ఏఎంసీకి 'వంద'నం
ఎందరో గొప్ప డాక్టర్లను, శాస్త్రజ్ఞులను అందించిన ఆంధ్రా మెడికల్ కళాశాల.. శతాబ్ది వేడుకలకు సిద్ధమైంది. 8లో



కాలుష్యంపై ఆందోళన 8లో
బయో కెమికల్ పరిశ్రమ కాలుష్యంపై ప్రజలు ఆందోళన చేయడంతో అధికారులు నమూనాలు సేకరించి పరీక్షకు పంపారు.



యోగా పోటీలు
విశాఖ: 29న ఉత్తరాంధ్ర జిల్లాల యోగా పోటీలు జరగనున్నాయి. వీసీ ప్రసాదరెడ్డి గురువారం పోటీల పోస్టర్ ఆవిష్కరించారు.

న్యూస్‌రీల్

జెడ్పీ సీఈవోగా పోలినాయుడు బాధ్యతల స్వీకరణ



పోలినాయుడిని సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు తదితరులు

మహారాణిపేట: జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో)గా ఎం.పోలినాయుడు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సీఈవోగా పనిచేస్తున్న పి.శ్రీరామ్మూర్తిని సహకార శాఖకు బదిలీ చేశారు. ప్రస్తుతం డి.పోలినాయుడు డివిజినల్ లెవెల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీఎల్‌డీవో) హోదాలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు వద్ద ఓఎస్డీగా పనిచేస్తున్నారు. ఆయన్ను జెడ్పీ సీఈవోగా నియమిస్తూ పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని బాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలినాయుడు తెలిపారు.

వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ సత్కారం

మాడుగుల: జిల్లా పరిషత్ సీఈవోగా బాధ్యతలు స్వీకరించిన ఎం.పోలినాయుడిని వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చిరికి శ్రీనివాసరావు ఘనంగా సత్కరించారు. ఆయన గురువారం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ సభ్యులు కలిసి దుశ్శాలువాతో సన్మానించారు. 2019లో మాడుగుల ఎంపీడీవోగా నియమితులైన పోలినాయుడు మండలంలో మారుమూల గ్రామాల్లోని సమస్యలను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యేలా కృషి చేశారు. ముఖ్యంగా గిరిజన గ్రామాలకు పక్కా రోడ్లు వేయించి, ప్రభుత్వ పథకాలు అందేలా చేశారు. ఆయన పనితీరును గుర్తించిన డిప్యూటీ సీఎం తన వద్ద ఓఎస్డీగా వేయించుకున్నారు. ఇప్పుడు జెడ్పీ సీఈవోగా నియమితులు కావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.


బడిఈడు పిల్లలందరూ బడిలోనే..
- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: జిల్లాలో బడిబయట ఉన్న 2,141 మంది విద్యార్థులు వచ్చే నెల పదో తేదీలోగా బడిలో లేదా ఓపెన్ స్కూల్లో చేర్పించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన విద్యాశాఖాధికారులతో సమావేశమయ్యారు. విద్యార్థులకు సంబంధించిన జీఈఆర్ గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (స్థూల నమోదు నిష్పత్తి) శత శాతంగా ఉండాలన్నారు. చదువుపై ఆసక్తి లేని వారిని వృత్తి విద్యా శిక్షణలో చేర్పించాలని స్కిల్ డెవలప్‌మెంట్ అధికారిని ఆదేశించారు. స్టూడెంట్ ఇన్ఫో పోర్టల్ నమోదు కాని 11,560 విద్యార్థుల వివరాలు వచ్చే నెల పదిలోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. నవంబర్ 3న ఆంగ్ల మాధ్యమంలో జరిగే ఎస్ఈఏఎస్ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అవగాహన తరగతులు, వీలైనన్ని ఎక్కువ మాక్ టెస్ట్స్ నిర్వహించాలని ఎంఈవోలను ఆదేశించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు రేమెడియల్ తరగతులు నిర్వహించి శత శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా కృషి చేయాలన్నారు. డీఈవో వెంకటలక్ష్మమ్మ, డీవైఈవో సుజాత, ఏడీ(స్కీమ్స్) రవిబాబు, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి చాముండేశ్వరరావు, జిల్లాలో ఎంఈవోలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

అనకాపల్లి ఏఎంసీ చైర్మన్‌గా శ్రీనివాసరావు



అనకాపల్లి టౌన్: అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గొల్లవిల్లి శ్రీనివాసరావును నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీకి గౌరవ చైర్మన్‌గా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఉపాధ్యక్షుడిగా కరక సోమునాయుడు, సభ్యులుగా నీటిపల్లి లక్ష్మి, మరిపల్లి శోభ, బొబ్బిలి శ్యామల, ఈగల నూకరత్నం, దాడి తల సీకుమారి, బొడ్డు జయ, కటారి దుర్గ, టి.లక్ష్మి, దాడి కుమారివరహా కృష్ణ, ఒమ్మి మోదిబాబు, కె.వి.ఎస్.కె.బాబు, గుండా రమేష్‌గుప్తా, గొంతిన శివ, కశింకోట మండలం నర్సింగపల్లి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి, అనకాపల్లి జిల్లా అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారి, అనకాపల్లి వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, జీవీఎంసీ మేయర్ నియమితులయ్యారు. ఈ కమిటీ నియామకం ఏడాది పాటు ఉంటుందని ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాసరావు తెలిపారు.

సలాం జాగిలం.. సాహో ఆయుధం

నేరస్తులను గడగడలాడించే ఆయుధాలు.. నేర స్థలంలో ఆధారాలను పసిగట్టి తప్పు చేసిన వారి పనిపట్టే జాగిలాలు.. పోలీసుల విధులు.. శాంతిభద్రతల నిర్వహణ, నేరాల కట్టడిలో వారి సాహసాలు.. ఇలా ఎన్నో విశేషాలతో సాగిన పోలీస్ ఓపెన్ హౌస్ అందరినీ ఆకట్టుకుంది.



కలెక్టర్‌కు పోలీసు జాగిలం షేక్‌హ్యాండ్

- పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో ఓపెన్ హౌస్
- విన్యాసాలను ఆసక్తిగా తిలకించిన విద్యార్థులు
- త్వరలో నర్సీపట్నంలో జాగిలాల కెనైన్: కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



జాగిలాల ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థులు

సాక్షి, అనకాపల్లి: వెల్‌కం కలెక్టర్ సాబ్.. అంటూ షేక్‌హ్యాండ్ ఇచ్చాయి.. విన్యాసాలెన్నింటినో ప్రదర్శించి ఔరా అనిపించాయి.. అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో పోలీసు అమరవీరుల వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన ఓపెన్ హౌస్ కార్యక్రమంలో పోలీసు జాగిలాలు తమ ప్రజ్ఞాపాటవాలు ప్రదర్శించాయి. చోరీ కేసుల్లో నిందితులను ట్రాక్ చేసే జాగిలం పేరు 'జిక్కీ'.. పేలుడు పదార్థాలను గుర్తించేది 'హోల్గా'.. గంజాయి, ఇతర మత్తు పదార్థాలను కనిపెట్టే జాగిలం పేరు రాఖీ.. వీటి విన్యాసాలు విద్యార్థులను విశేషంగా అలరించాయి. గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి, మహిళా చట్టాలు, పోక్సో యాక్ట్, దిశ యాప్, సైబర్ క్రైమ్ వలన జరిగే నష్టాల గురించి పోలీసు అధికారులు అవగాహన కల్పించారు. బాంబు డిస్పోజబుల్ టీం, నేర పరిశోధనలో డాగ్ స్క్వాడ్‌ల పనితీరు వివరించారు. ఆయుధాలు ఏకే - 47, పిస్టల్, గ్లో 17, కార్బన్, ఇన్సాస్ రైఫిల్, మల్టీ గ్యాస్ గన్ లాంచర్, గ్రెనేడ్‌లు ఎలా పనిచేస్తాయో కళ్లకు కట్టారు. మాబ్‌ని కంట్రోల్ చేసే వజ్ర వాహనం, లైట్ గేర్ ఎక్విప్‌మెంట్, వీల్స్ ఆన్ అవేర్‌నెస్ వాహనం, దిశా వాహనాలను ప్రదర్శించారు. నైట్ విజన్, శాటిలైట్ ఫోన్, స్కానర్, వీహెచ్‌ఎఫ్ సెట్, రోబో డ్రెస్‌ల వంటి పరికరాలను చూపించారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో నర్సీపట్నంలో జాగిలాల కెనైన్‌ను ఏర్పాటు చేస్తామని, దీని ద్వారా గంజాయి రవాణాను మరింత పటిష్టంగా అరికట్టేందుకు వీలవుతుందని అన్నారు. నేరస్థులను గుర్తించడంలో జాగిలాల పాత్ర కీలకమన్నారు. క్రైం కేసు ఛేదనలో 'సాంకేతిక పరిజ్ఞానం' అందిపుచ్చుకుని నేరస్తులను మరింత సమర్థంగా పట్టుకోవాలని సూచించారు. ఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ పోలీసులు విధి నిర్వహణలో వినియోగించే అత్యాధునిక ఆయుధాలు, వివిధ పరికరాలు, నేరస్తులను పట్టుకోవడంతో పోలీసు జాగిలాల పాత్ర.. తదితర విషయాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. పోలీసుల విధి నిర్వహణలో పోలీసుల కష్టాన్ని అర్థం చేసుకొని, వారి నుంచి స్ఫూర్తి పొంది భవిష్యత్తులో వారికి సహకరించేలా ఓపెన్ హౌస్ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ గర్ల్స్ హైస్కూల్, జీవీఎంసీ మెయిన్ స్కూల్, నారాయణ, భాష్యం, సర్వేపల్లి జూనియర్ కాలేజ్ విద్యార్థులు, అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయభాస్కర్, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్‌లు చంద్రశేఖర్, అప్పలనాయుడు, పోలీసు కంట్రోల్ రూమ్ ఇన్‌స్పెక్టర్ పైడపునాయుడు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణారావు, సతీష్, అనకాపల్లి టౌన్ ఎస్‌హెచ్‌ఓలు మోహనరావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు శ్రీను, కమ్యూనికేషనల్ ఇన్‌స్పెక్టర్లు వెంకటచిట్టి, ఎస్సైలు శేఖరం, సింహాచలం, ఆదినారాయణ, భవాని వరప్రసాదరావు, ఢిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆయుధాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి, ఎస్పీ మురళీకృష్ణ, అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్

అమూల్ దసరా కానుక

'అచ్యుతాపురం మండలంలో రాజన్నపాలెం గ్రామ సంఘానికి చెందిన సత్యవతి అనే మహిళా పాడి రైతు 'జగనన్న పాలవెల్లువ'లో భాగంగా అమూల్ సంస్థకు పాలు సరఫరా చేస్తోంది. గత ఏడాది మే నెల నుంచి ఈ సంవత్సరం మార్చి వరకు పోసిన పాలుకు ఏకంగా రూ.45,522 బోనస్ అందుకుంది. తన ఖాతాలో అంత మొత్తం జమ అయినందుకు ఆమె ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయింది. జిల్లాలో పాడి రైతులందరిలో సత్యవతికి గరిష్టంగా అదనపు ఆదాయం చేకూరింది.'

- పాడి రైతులకు బోనస్ మంజూరు
- రూ.98.37 లక్షల రాయల్టీ ఇన్సెంటివ్‌లు బ్యాంకు ఖాతాల్లో జమ



పాలు సరఫరా చేస్తున్న మహిళా పాడి రైతు

సాక్షి, అనకాపల్లి: అమూల్ మరోసారి పాడి రైతులకు తీపి కబురు అందించింది. దసరా కానుకగా బోనస్‌ను మంజూరు చేసింది. 2022 మే నెల నుంచి 2023 మార్చి నెల వరకు సరఫరా చేసిన పాల మీద లీటరుకు కనిష్టంగా రూ.4.67 నుంచి గరిష్టంగా రూ.6.12 వరకు మొత్తం రూ.98,37,673 రాయల్టీ ఇన్సెంటివ్‌ను అందించింది. బనాస్ మిల్క్ యూనియన్ వారు నేరుగా మహిళా పాడి రైతుల బ్యాంక్ ఖాతాల్లో సొమ్ము జమ చేశారు. లీటర్‌పై గరిష్టంగా రూ.40 ధర తీసుకున్న పాడి రైతుకు రూ.2 చొప్పున, రూ.90 ధర తీసుకున్న పాడి రైతుకు రూ.4.50 చొప్పున అదనపు ఆదాయం అందించారు. జిల్లాలో అమూల్ ప్రారంభించినప్పటి నుంచి ఐదు సార్లు పాలసేకరణ ధరలు పెంచారు. ఈ పథకం ప్రారంభంలో గేదె పాల ధర లీటర్ రూ.71.47... ఆవు పాల ధర రూ.34.20 ఉండేది. ప్రస్తుతం లీటర్ గేదె పాలకు రూ.89.76, ఆవు పాలకు రూ.43.61 రైతులకు చెల్లిస్తున్నారు. జిల్లాలో జగనన్న పాల వెల్లువ కార్యక్రమాన్ని 2022లో మే 20వ ప్రారంభించారు. మొదటి దశలో 135 కేంద్రాల ద్వారా 20 వేల లీటర్ల పాలు, రెండో దశలో 7 మండలాల్లోని 85 గ్రామాల్లో 4,500 లీటర్ల పాలు సేకరిస్తున్నారు. రెండో దశ పాడి రైతులు కూడా ఈ ఏడాది అక్టోబర్ 7వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు సరఫరా చేసిన పాలకు బోనస్‌ను పొందుతారు.

పాడి రైతులకు ప్రోత్సాహకాలు

ఆరు నెలల వ్యవధిలో 90 రోజులపాటు పాలు పోసిన మహిళా పాడి రైతులు సభ్యులుగా 91 మహిళా డెయిరీ సహకార సంఘాలు ఏర్పాటయ్యాయి. వీరికి నాణ్యమైన దాణా, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ద్వారా 7 శాతం వడ్డీకి (3 శాతం రాయితీ పోను 4 శాతం మాత్రమే) స్వల్పకాలిక రుణాలు (రూ.35,000 వరకు), 11 శాతం వడ్డీకి పాడి పశువుల కొనుగోలు నిమిత్తం దీర్ఘకాలిక రుణాలు (రూ.1,60,000 వరకు) ప్రభుత్వం అందజేస్తుంది. రాయల్టీ ఇన్సెంటివ్‌లను ప్రతి ఏడాది అక్టోబర్ నెలలో చెల్లిస్తారు. వాటితో పాటు పాల సేకరణ చేపడుతున్న ఏఎంసీయూ సెక్రటరీలకు హ్యాండ్లింగ్ చార్జీలను లీటర్‌కి రూపాయి చొప్పున ప్రతి నెలా సొసైటీ ఖాతాకు జమ చేస్తున్నారు.

అదనపు ఆదాయం



పాలు సరఫరా చేస్తున్న పాడి రైతులకు అమూల్ సంస్థ అనేక విధాలుగా ప్రోత్సాహకాలు అందిస్తోంది. అమూల్ రాక ముందు పాల సేకరణ ధరలను ఇప్పటి ధరలతో పోలిస్తే.. లీటర్ గేదె పాలకు సుమారు రూ.11, ఆవు పాలకు రూ.10 వరకు అదనంగా లభిస్తోంది. దీంతో పాడి రైతులు అమూల్‌కి పాలు పోసేందుకు ముందుకు వస్తున్నారు. అంతేకాకుండా పాడి రైతుల సమస్యలు ఎప్పటికప్పుడు నివృత్తి చేసేందుకు కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. 83094 19259 నంబరుకు ఫోన్ చేసి పాడి రైతులు తమ ఇబ్బందులను వివరించవచ్చు.

– డాక్టర్ ప్రసాద్‌రావు, పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్

అనకాపల్లి నుంచే ఎన్నికల శంఖారావం

- 9న జరిగే 'సామాజిక సాధికార' సభతో సమరానికి శ్రీకారం
- బస్సు యాత్ర విజయవంతానికి కార్యకర్తలు కలిసి రావాలి
- నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో మంత్రి అమర్‌నాథ్



సమావేశానికి హాజరైన నియోజకవర్గ పార్టీ శ్రేణులు



మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లి టౌన్: సామాజిక సాధికార బస్సు యాత్రను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. స్థానిక రింగ్ రోడ్డు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 31వ తేదీకి 175 నియోజకవర్గాల్లో బస్సు యాత్ర పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారన్నారు. గురువారం ఇచ్ఛాపురంలో ప్రారంభమైన తొలి విడత బస్సు యాత్ర నవంబర్ 9న అనకాపల్లి నియోజకవర్గంలో ముగుస్తుందన్నారు. ఆ రోజు బహిరంగ సభ వచ్చే ఎన్నికలకు శంఖారావం కావాలన్నారు. పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పని చేసి ఈ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సభలో ఉత్తరాంధ్రకు చెందిన మంత్రులు, ముఖ్య నాయకులు, కో ఆర్డినేటర్లు పాల్గొంటారని వివరించారు. నాలుగున్నరేళ్ల ఒక ఎత్తు.. వచ్చే ఆర్నెల్లు మరో ఎత్తు అన్నారు. వచ్చే నెల 1, 2 తేదీల్లో గ్రామాల వారీగా పార్టీ నాయకులతో తాను సమావేశం నిర్వహిస్తానని చెప్పారు. అదేవిధంగా గృహసారథుల ఇన్సూరెన్స్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని నాయకులను ఆదేశించారు.

సామాజిక న్యాయమే వైఎస్సార్‌సీపీ నినాదం

సామాజిక న్యాయమే వైఎస్సార్‌సీపీ నినాదంగా మలుచుకుని ముందుకు సాగుతోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. గత ప్రభుత్వాలు అమలు చేయని విధంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు అందజేసిందన్నారు. సీఎం జగన్‌పై విశ్వాసాన్ని ఎన్నికల్లో నిరూపించుకోవాలని కోరారు. ఏపీ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ వచ్చే నెల 9న జరిగే బహిరంగ సభను సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి గుర్తుండిపోయేలా నిర్వహించాలని కోరారు. నియోజకవర్గ ప్రజలు మళ్లీ అమర్‌నాథ్‌నే గెలిపించాలన్న సంకల్పంతో ఉన్నారని, 2024 ఎన్నికల్లోనూ వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేయాలనే లక్ష్యంతో పార్టీ శ్రేణులు పని చేయాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ పట్టణాధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అధ్యక్షతన వహించిన కార్యక్రమంలో జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు పెతకంశెట్టి జోసెఫ్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరహా సత్యవతి, ఎంపీపీలు గొర్లి సూరిబాబు, కలగా లక్ష్మి, మండల పార్టీల అధ్యక్షులు పెదిశెట్టి గోవింద, మలసాల కిశోర్, ఎన్టీఆర్ వైద్యాలయం అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామ్మూర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, పట్టణ, మండల మహిళా విభాగం అధ్యక్షులు ఎ.వి.రత్నకుమారి, మద్రిపల్లి శోభ, దేవస్థానం చైర్మన్లు కొణతాల మురళీకృష్ణ, ఆళ్ల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, జెడ్పీటీసీ దంతులూరి శ్రీధర్‌రాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

రేపు రాత్రి 7 తర్వాత నూకాంబిక దర్శనాల రద్దు
- పాక్షిక చంద్రగ్రహణం కారణంగా నిర్ణయం

అనకాపల్లిటౌన్: పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా ఈ నెల 28(శనివారం)న రాత్రి 7 గంటల నుంచి ఉత్తరాంధ్ర ఇలవేల్పు గవరపాలెం శ్రీ నూకాంబిక అమ్మవారి దర్శనాలను నిలుపుదల చేయనున్నట్లు ఆలయ ఈవో బండారు ప్రసాద్, చైర్మన్ కొణతాల మురళీకృష్ణలు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రహణ మోక్షకాలం అనంతరం ఆదివారం ఉదయం 5 గంటలకు అమ్మవారికి సంప్రోక్షణ జరిపి, యధావిధిగా భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని గమనించి, సహకరించాల్సిందిగా భక్తులను కోరారు.

ఉపాధ్యాయిని దుర్మరణం



దేవరాపల్లి మండలం బేత పూడి కస్తూర్బా బాలికా విద్యాలయలో పనిచేస్తున్న ఉపాధ్యాయిని బొడ్డు శ్రీదేవి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. 8లో

'పారా'హుషార్

ప్రతిభకు వైకల్యం అడ్డంకి కాదని నిరూపించడమే కాదు.. ప్రధానితో శభాష్ అనిపించుకున్నాడు. దివ్యాంగులకు ప్రత్యేకంగా క్రీడా పోటీలు నిర్వహిస్తారని డిగ్రీలోకి వచ్చే వరకు అతడికి తెలియదు. ఇప్పుడు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు కొల్లగొడుతున్నాడు. రైతు కుటుంబం నుంచి వచ్చిన తనకు ఆర్థిక సమస్యలు వెక్కిరిస్తున్నా, తల్లిదండ్రుల ఆశలు వమ్ము చేయకుండా సత్తా చాటుతున్నాడు. తాజాగా ఆసియా పారా క్రీడల్లో రజతం సాధించిన రొంగలి రవి పేరు ఒక్కసారిగా మార్మోగుతోంది.

- ఆసియా పారా క్రీడా పోటీల్లో దివ్యాంగ క్రీడాకారుడికి రజతం
- చైనా అథ్లెటిక్స్‌లో రొంగలి రవి సత్తా
- స్వగ్రామం చిరికివానిపాలెంలో సంబరాలు
- రైతు కుటుంబం నుంచి రాణిస్తున్న యువకుడు



దేశం తరపున పతకం సాధించిన ఆనందంలో క్రీడాకారుడు రవి



షాట్‌పుట్ విసురుతున్న రవి

కె.కోటపాడు: చైనాలో ఆసియా పారా క్రీడా పోటీల్లో ఎఫ్–40 షాట్‌పుట్ విభాగంలో దివ్యాంగ క్రీడాకారుడు రొంగలి రవి రజత పతకం సాధించి సర్వత్రా ప్రశంసలందుకుంటున్నాడు. అతడి విజయంతో కె.కోటపాడు మండలం వారాడ శివారు తన స్వగ్రామం చిరికివానిపాలెంలో సంబరాలు వెల్లివిరిశాయి. దేశానికి, పుట్టిన గ్రామానికి, తల్లిదండ్రులకు గుర్తింపును తీసుకొచ్చాడని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చదువుల్లోనూ ఉత్తమ ఫలితాలు

చిన్నప్పటి నుంచి రవి క్రీడలతోపాటు చదువుల్లోను ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నాడు. ఒకటి నుంచి పదో తరగతి వరకు భీమిలి ఏఎంజీ పాఠశాలలో చదివాడు. పదిలో 9.0 గ్రేడ్‌తో ఉత్తీర్ణత సాధించాడు. ఎస్.కోటలో ఇంటర్ చదివి 933 మార్కులు, డిగ్రీలో 7.8 గ్రేడింగ్‌తో ఉత్తీర్ణత సాధించాడు.

17వ ఏట పారా క్రీడా పోటీలపై ఆసక్తి

రవి తొలుత బ్యాడ్మింటన్ నేర్చుకున్నాడు. 2015లో బెంగళూరులో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్నాడు. బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో బ్రాంజ్, డబుల్స్‌లో సిల్వర్ మెడల్ సాధించాడు.

- 2016 ఢిల్లీలో పారా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని సింగిల్, డబుల్స్‌లో బ్రాంజ్ మెడల్ పొందాడు.
- 2017 హైదరాబాద్‌లో పారా బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీల్లో డబుల్స్‌లో సిల్వర్ మెడల్ సాధించాడు.

బ్యాడ్మింటన్ నుంచి అథ్లెటిక్స్ వైపు..

దివ్యాంగ క్రీడాకారుడు రవిది రైతు కుటుంబం కావడంతో ఆర్థిక స్థోమత అంతంత మాత్రంగానే ఉండేది. దాంతో బ్యాడ్మింటన్ పోటీలపై ఆసక్తి తగ్గించుకుని అథ్లెటిక్స్ విభాగంలో షార్ట్‌పుట్, జావెలిన్ త్రో పోటీల వైపు దృష్టి సారించాడు.

- 2017లో హర్యానాలో 18వ పారా చాంపియన్ షిప్ అథ్లెటిక్స్ పోటీల్లో ఎఫ్–40 షాట్‌పుట్, జావెలిన్ త్రోలో గోల్డ్ మెడల్ సాధించాడు.
- 2020 బెంగుళూరులో 3వ పారా అథ్లెటిక్స్ పోటీల్లో షార్ట్‌పుట్, జావెలిన్ త్రోలో గోల్డ్ మెడల్
- 2021 దుబాయ్‌లో పారా అథ్లెటిక్ చాంపియన్ షిప్‌లో షాట్‌పుట్, జావెలిన్ త్రోలో నాల్గో స్థానం
- 2022లో పోర్చుగల్‌లో ఐవర్ వరల్డ్ అథ్లెటిక్స్ పోటీల్లో షార్ట్‌పుట్, జావెలిన్ త్రోలో సిల్వర్ మెడల్స్
- ఈ ఏడాది జూన్‌లో పారిస్‌లో ప్రపంచ పారా అథ్లెటిక్స్ పోటీల్లో షాట్‌పుట్‌లో ఐదో స్థానం
- ప్రస్తుతం చైనాలో ఆసియా పారా క్రీడా పోటీల్లో ఎఫ్–40 షాట్‌పుట్ విభాగంలో సిల్వర్ మెడల్

రైతు బిడ్డకు ఆర్థిక కష్టాలు

రవి తల్లిదండ్రులు రొంగలి దేముడుబాబు, మంగ స్వగ్రామం చిరికివానిపాలెంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కుమారుడు రవి దివ్యాంగుడైనప్పటికీ క్రీడల పట్ల అతడు చూపుతున్న ఆసక్తిని కాదన లేక ఆర్థిక స్థోమత లేకపోయినా అప్పుసప్పో చేసి ప్రోత్సహిస్తున్నారు. వారి ఆశయాలను వమ్ము చేయకుండా రవి పట్టుదలతో అథ్లెటిక్స్ పోటీల్లో రాణిస్తూ పతకాలు సాధిస్తున్నాడు. ఇతడి ప్రతిభను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం 2021లో బెంగళూరులో శాయి అకాడమీలో శిక్షణ ఇప్పించింది. ఆ సమయంలో వసతి, భోజన ఏర్పాట్లకు సంబంధించి ఖర్చులు తల్లిదండ్రులు పంపించేవారని రవి తెలిపాడు.



తల్లిదండ్రులు, సోదరుడితో రవి

తల్లిదండ్రుల శ్రమ ఫలితమే..

చైనాలోని ఆసియా పారా క్రీడా పోటీల్లో షాట్‌పుట్ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించడం ఎంతో ఆనందంగా ఉంది. ఈ విజయం ద్వారా దేశ ప్రధాని నుంచి ప్రశంసలు అందుకోవడం ఎంతో మధురానుభూతికి లోనవుతున్నా. చిన్నప్పటి నుంచి చదువుతోపాటు క్రీడల్లో నా చురుకుదనాన్ని గుర్తించిన తల్లిదండ్రులు వారికి ఆర్థిక స్థోమత లేకపోయినా ఎంతగానో ప్రోత్సహిస్తున్నారు. ఈ రోజు దేశం గర్వించదగ్గ స్థాయిలో పతకం సాధించానంటే వారి శ్రమ ఫలితమే..

– రొంగలి రవి, పారా అథ్లెట్

క్లుప్తంగా

శ్యాంప్రసాద్‌కు అభినందన సత్కారం


పీఈటీ శ్యాంప్రసాద్‌ను సత్కరిస్తున్న దాడి రత్నాకర్

తుమ్మపాల: ఈ నెల 16 నుంచి 19 వరకు ఢిల్లీలో జరిగిన అఖిల భారత సివిల్ సర్వీసెస్ గేమ్స్‌లో సిల్వర్ మెడల్ సాధించిన దాడి శ్యాం ప్రసాద్‌ను వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు దాడి రత్నాకర్ గురువారం అభినందించి, సత్కరించారు. శ్యాంప్రసాద్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ ఖోఖో జట్టు ఈ పోటీల్లో పాల్గొని, ద్వితీయ స్థానంలో నిలవడంపై హర్షం వ్యక్తం చేశారు. దాడి శ్యాంప్రసాద్ అచ్యుతాపురంలోని జెడ్పీ హైస్కూల్లో పీఈటీగా పనిచేస్తున్నారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు దాడి జయవీర్, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సత్తిబాబు మృతదేహం లభ్యం


రైవాడ జలాశయంలో నీటిపై తేలిన సత్తిబాబు మృతదేహం

దేవరాపల్లి: రైవాడ జలాశయంలో బుధవారం గల్లంతైన రొంగలి సత్తిబాబు(38) మృతదేహం గురువారం నీటిపై తేలింది. సబ్బవరం మండలం బులుసుపాలెం గ్రామానికి చెందిన సత్తిబాబు, మరి కొందరితో కలిసి బుధవారం జలాశయం సందర్శనకు వెళ్లాడు. జలాశయం ఒడ్డున ఉన్న మత్స్యకారుల బోటుపై లోపలికి వెళ్లాడు. బోటు బోల్తాపడి గల్లంతయ్యాడు. అతని ఆచూకీ కోసం ఎస్‌ఐ డి.నాగేంద్ర ఈతగాళ్లతో గురువారం జలాశయంలో గాలించగా, సత్తిబాబు మృతదేహం లభించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి పంపినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఏఎంసీకి 'వంద'నం

- శతాబ్ది వేడుకలకు ఆంధ్రా మెడికల్ కళాశాల సిద్ధం
- నేటి నుంచి మూడు రోజుల పాటు వేడుకలు
- రేపు హాజరు కానున్న ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్


విద్యుత్ దీపాల అలంకరణలో ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రధాన ద్వారం

మహారాణిపేట: ఆంధ్రా వైద్య కళాశాల కాకలు తీరిన వైద్యులను అందించింది. ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు ముందు ఏర్పాటైన ఈ వైద్య కళాశాల దేశంలోనే పురాతనమైంది. వందేళ్ల వేడుకకు సిద్ధమైన కళాశాలలో పండగ వాతావరణం నెలకొంది. శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే శతాబ్ది ఉత్సవాలకు ప్రముఖులు హాజరవుతున్నారు. శుక్రవారం కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.ఎల్.మాండవీయ వర్చువల్‌గా హాజరవుతారు. శనివారం భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పాల్గొంటారు. ఈ కార్యక్రమాల్లో మంత్రులు విడదల రజని, గుడివాడ అమర్‌నాథ్, ఉన్నతాధికారులు, పూర్వ విద్యార్థులు భాగస్వాములవుతారు. ఈ సందర్భంగా అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఏఎంసీ భవనాలను సుందరంగా అలంకరించింది. విద్యుత్ దీపాలతో కేజీహెచ్, ఏఎంసీ ధగధగలాడుతోంది.

వైజాగపటం నుంచి ఏఎంసీగా..

తెలుగు వారి కోసం ప్రత్యేకంగా ఓ వైద్య కళాశాల ఉండాలంటూ అప్పటి మద్రాస్ ప్రభుత్వానికి తెలుగు ప్రజలు చేసిన విన్నపాలతో 1923 జూలై 19న మెడికల్ కళాశాల ప్రారంభమైంది. మద్రాసు యూనివర్సిటీకి అనుబంధంగా పనిచేసిన ఈ వైద్య కళాశాలకు ముందుగా వైజాగపటం వైద్య కళాశాల అని పేరు పెట్టారు. 1926లో ఆంధ్రా యూనివర్సిటీ ప్రారంభమైన తర్వాత వైజాగపటం వైద్య కళాశాల ఏయూకి అనుబంధ కళాశాలగా మారింది. ఆ సమయంలో ఏయూ ఉపకులపతి సీఆర్ రెడ్డి దీని పేరును ఆంధ్రా మెడికల్ కాలేజ్‌గా మార్చాలని మద్రాస్ ప్రభుత్వాన్ని కోరగా 1940లో గెజిట్ విడుదలైంది. ఆ తర్వాత నుంచి ఈ కళాశాల ఆంధ్రా మెడికల్ కాలేజ్‌గా ప్రసిద్ధి చెందింది. అనాటమీ, ఫిజియాలజీ, బయోలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్ విభాగాలతో ప్రారంభమైన ఈ కళాశాలలో తొలి సంవత్సరం 50 మంది విద్యార్థులకు అవకాశం కల్పిస్తే.. 32 మంది ప్రవేశాలు పొందారు. ప్రవేశాలు పొందిన వారిలో తొలి ఏడాది 59 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు రికార్డులు చెబుతున్నాయి. రెండో ఏడాది ఓ మహిళ దరఖాస్తు చేసుకున్నారు. కానీ మహిళల కోసం ప్రత్యేక గదులు, బాత్రూం వంటి సదుపాయాలు లేకపోవడంతో ఆమె దరఖాస్తును తిరస్కరించినట్లు వైద్యులు చెబుతారు. 1942లో మహిళల కోసం హాస్టల్ నిర్మించారు.

ఎందరో మహానుభావులు..

ఏఎంసీలో చదివిన ఎంతో మంది ఉన్నత శిఖరాలను అధిరోహించారు. డాక్టర్ రామన్ విశ్వనాథన్, డాక్టర్ పెరుగు శివారెడ్డి, డాక్టర్ శ్రీపాద పినాకపాణి, డాక్టర్ తిరుమలరావు, డాక్టర్ ఉలిమిరి రామలింగేశ్వరరావు, డాక్టర్ వ్యాఘ్రేశ్వరుడు, డాక్టర్ రాజారామ్మోహనరెడ్డి, డాక్టర్ రామలింగస్వామి, డాక్టర్ హిలిదా లాజరస్, డాక్టర్ ఎస్.ఎస్.శ్రీరామాచారి, డాక్టర్ కాకర్ల సుబ్బారావు, డాక్టర్ హబీబుల్లా, డాక్టర్ కూటికుప్పల సూర్యారావు, డాక్టర్ ఎస్.వి.ఆదినారాయణ తదితరులు అంతర్జాతీయంగా ఎంతో ప్రసిద్ధి చెందారు. డాక్టర్ పి.బ్రహ్మయ్యశాస్త్రి దేశంలో ప్రముఖ వైద్య శాస్త్రవేత్తగా పేరు పొందారు. దేశం గర్వించదగ్గ వైద్యులు చదువుకున్న చోటే మేం చదువుకోవడం, ఇక్కడే ఉద్యోగాలు పొందడం, ఇప్పుడు వందేళ్ల సంబరాల్లో పాలుపంచుకోవడం చాలా సంతోషంగా ఉందని కేజీహెచ్‌లో పనిచేస్తున్న పలువురు వైద్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదే కళాశాలలో చదువుకోవడం తమ కల అని విద్యార్థులు చెబుతున్నారు.

పూర్వ విద్యార్థుల 'వందేళ్ల' కానుక

పూర్వ విద్యార్థులు వందేళ్ల కానుకగా సెంటినరీ బ్లాక్ నిర్మిస్తున్నారు. మొత్తం రూ.50 కోట్లతో బ్లాక్ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. 1.2 ఎకరాల్లో స్టూడెంట్ సెంటర్, లెక్చర్ హాల్, లైబ్రరీ, రీడింగ్ రూమ్, రీక్రియేషన్ రూమ్, ఇండోర్ గేమ్స్ వంటి సదుపాయాలు కల్పిస్తున్నారు. ఈ బ్లాక్‌ను భారత ఉపరాష్ట్రపతి చేతులమీదుగా ప్రారంభించేందుకు ఏర్పాటు చేశారు.

ఉపాధ్యాయిని దుర్మరణం

- దేవరాపల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం
- శోక సముద్రంలో కుటుంబ సభ్యులు
- తల్లడిల్లిన విద్యార్థినులు, సహోధ్యాయులు
- గాయాలతో బయటపడ్డ మరో టీచర్


ఉపాధ్యాయిని బొడ్డు శ్రీదేవి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

దేవరాపల్లి: సహచర ఉపాధ్యాయులను పలకరించారు.. విద్యార్థుల వందనాన్ని అందుకొని వారిని ముద్దులాడారు.. పాఠశాల పనిపై ద్విచక్ర వాహనంపై వెళుతూ రోడ్డు ప్రమాదానికి గురై క్షణాల్లో ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయం తెలిసి కొద్ది సమయం ముందే తమ కళ్ల ముందు కనిపించిన ఉపాధ్యాయిని విగత జీవిగా మారడంతో విద్యార్థులు, సహోద్యోగులు దిగ్భ్రాంతి చెందారు. ఈ ప్రమాదంలో అదే వాహనంపై వెళుతున్న మరో టీచర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. దేవరాపల్లిలో గురువారం ఈ ఘోరం జరిగింది. సబ్బవరం మండలం పెదనాయుడుపాలెం గ్రామానికి చెందిన బొడ్డు శ్రీదేవి (37) దేవరాపల్లి మండలం బేతపూడి కస్తూర్బా బాలికా విద్యాలయలో సోషల్ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఆమె గురువారం ఉదయం యథావిధిగా పాఠశాలకు చేరుకున్నారు. పాఠశాలకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్ చేయించడానికి తన సహచర ఉపాధ్యాయిని దేవితో కలిసి ద్విచక్రవాహనంపై బేతపూడి నుంచి దేవరాపల్లి బయలుదేరి వెళ్లారు. ఆటోస్టాండు దాటిన తర్వాత ఎదురుగా వస్తున్న ఇసుక ట్రాక్టరును తప్పించే క్రమంలో వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో ఇద్దరూ రోడ్డు మీద పడిపోయారు. ట్రాక్టరు వైపు పడిపోయిన శ్రీదేవి ఛాతీ మీద నుంచి ట్రాక్టరు తొట్టె వెనుక చక్రం వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. వాహనం నడుపుతూ షాపుల వైపు పడిపోయిన మరో ఉపాధ్యాయిని దేవి ప్రాణాలతో బయటపడ్డారు. మృతి చెందిన ఉపాధ్యాయిని బొడ్డు శ్రీదేవికి భర్త నాగేశ్వరావుతో పాటు పదో తరగతి చదువుతున్న కుమార్తె త్రిషిక, నాలుగో తరగతి చదువుతున్న కుమారుడు కార్తికేయ ఉన్నారు. సబ్బవరం కస్తూర్బా విద్యాలయలో పనిచేస్తూ.. ఇటీవల దేవరాపల్లి మండలం బేతపూడి కస్తూర్బా పాఠశాలకు బదిలీపై వచ్చారు. భర్త నాగేశ్వరరావు, ఇతర కుటుంబ సభ్యులు విలపించిన తీరు అక్కడున్న వారందరినీ కంట తడి పెట్టించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి సీహెచ్‌సీకి తరలించినట్లు స్థానిక పోలీసు ఎస్‌ఐ డి.నాగేంద్ర తెలిపారు. ట్రాక్టరును స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఫ్లైఓవర్‌పై ఘోర ప్రమాదం

- డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకుల మృతి
- మరొకరి పరిస్థితి విషమం



సంఘటన స్థలంలో శ్యామ్ మృతదేహం (ఇన్‌సెట్) శ్యామ్ (ఫైల్)


తోట హర్ష (ఫైల్)

ఉపాధి కోసం నగరానికి వచ్చిన ఇద్దరు యువకులు తెలుగుతల్లి ఫ్లైఓవర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదానికి బలయ్యారు. మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఫ్లైఓవర్‌పై మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతుండటం ఆందోళన గురి చేస్తోంది. వేగంగా వస్తూ వాహనాలను అదుపు చేయలేక ప్రమాదానికి గురవుతున్నారు.

అల్లిపురం: నగరంలోని తెలుగు తల్లి ఫ్లైఓవర్‌పై ఘోర ప్రమాదం జరిగింది. బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. రెండో పట్టణ ఇన్‌చార్జి సీఐ రమణమూర్తి తెలిపిన వివరాలివీ.. అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన కాపరపు శ్యామ్(21), కాపరపు రాజు అలియాస్ బాబీ(20), అనకాపల్లి జిల్లా కొత్తూరుకు చెందిన తోట హర్ష అలియాస్ నాని ఇళ్లకు సున్నాలు వేస్తూ.. తద్వారా వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గాజువాకలో సున్నాలు వేసేందుకు వచ్చిన వారు బుధవారం రాత్రి 10.45 గంటల ప్రాంతంలో ఒకే బైక్‌పై ఆర్.కె.బీచ్‌కు వెళ్లారు. తిరిగి సుమారు మూడు గంటల ప్రాంతంలో తెలుగు తల్లి ఫ్లైఓవర్ మీదుగా గాజువాక వెళ్తున్నారు. ఈ క్రమంలో వాహనం అదుపు తప్పడంతో వంతెన చివర్లో మలుపు వద్ద డివైడర్‌ను బలంగా ఢీకొట్టారు. ప్రమాదంలో శ్యామ్ తలకు తీవ్ర గాయమై ఘటనా స్థలంలోనే మరణించాడు. హర్ష తలకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. రాజు కాళ్లు విరిగిపోవడంతో ఇద్దరినీ ఆస్పత్రికి తరలించారు. మార్గమధ్యలోనే హర్ష ప్రాణాలు కోల్పోయాడు. రాజు ప్రస్తుతం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శ్యామ్, రాజులిద్దరూ అన్నదమ్ముల పిల్లలు.

సంఘటన స్థలాన్ని పరిశీలించిన సీపీ

ఈ విషయం తెలుసుకున్న నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ గురువారం ఉదయం సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ప్రమాదాలు జరగకుండా తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ ఏడీసీపీ, ఏసీపీలను ఆదేశించారు.

మత సామరస్యానికి ప్రతీక ఖాదరీబాబా ఉరుసు


ఖాదరీబాబా దర్గాలో సమాధి వద్ద ముస్లింల ప్రార్థనలు

కశింకోట: కశింకోటలో ప్రసిద్ధి చెందిన హజరత్ సయ్యద్ అబ్దుల్ అజీజ్ షా ఖాదరీబాబా దర్గా ఉరుసు షరీఫ్ ప్రారంభమైంది. మత సామరస్యానికి ప్రతీకగా మూడు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో తొలి రోజైన గురువారం భక్తులు ఖాదరీబాబా సమాధిని దర్శించి, ప్రార్థనలు నిర్వహించారు. ఉమ్మడి విశాఖ జిల్లాతోపాటు ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఎక్కువగా ముస్లింలు, హిందువులు బాబా సమాధిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఖురాన్ పఠనం చేశారు. శుక్రవారం ప్రధానమైన ఉరుసు షరీఫ్ జరగనుంది. ఈ సందర్భంగా చందనాన్ని సంప్రదాయంగా గుర్రంపై ఉంచి దర్గా నుంచి పెద బజారు, సంతబయల మీదుగా అగ్రహారంలోని ఖాదరీబాబా ఇంటి వరకు ఊరేగిస్తారు. అక్కడి నుంచి తిరిగి దర్గాకు ఊరేగించి ఖాదరీ బాబా సమాధికి చందనాన్ని పూస్తారు. ఇందుకు ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. రాత్రి 9 గంటలకు ఖవ్వాలి ఉర్దూ పాటల పోటీలు జరగనున్నాయి.

సామాజిక న్యాయం సీఎం జగన్‌తోనే సాధ్యం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

మునగపాక: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాల ప్రజలకు సామాజిక న్యాయం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. నాలుగున్నరేళ్ల పాలనలో ప్రజలకు తమ ప్రభుత్వం ద్వారా జరిగిన మేలును వివరించేందుకు సామాజిక సాధికార బస్సు యాత్రకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు పూర్తి స్థాయిలో అమలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. తొలివిడత బస్సు యాత్ర నవంబర్ 2న మాడుగుల నియోజకవర్గం తారువలో విలేకరుల సమావేశం నిర్వహించిన తరువాత ఘాట్‌రోడ్డులో సభ జరుగుతుందన్నారు. 9వ తేదీన అనకాపల్లి నియోజకవర్గంలో బస్సుయాత్ర జరుగుతుందన్నారు. మోసపూరిత మేనిఫెస్టో ప్రకటించి ప్రజలను మోసం చేసిన చంద్రబాబుకు, అతని మిత్రపక్షం జనసేనకు ప్రజలు గుణపాఠం చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను అభివృద్ధి చేయడంతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు మేలు చేసేలా పాలన సాగిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి ముఖ్యమంత్రిగా అవకాశం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. బస్సు యాత్ర ద్వారా ఇంతవరకు అందించిన సంక్షేమ పథకాలతో పాటు, అభివృద్ధిని సైతం ప్రజలకు అర్థమయ్యేలా వివరించేందుకు మంత్రులు ప్రజల వద్దకే వస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నేతలు టెక్కలి కొండలరావు, దొడ్డి బుజ్జి, ఇల్లా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికి తీసేందుకు పోటీలు దోహదం


జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తున్న కమిషనర్ రవిబాబు

నర్సీపట్నం: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు బాలల ప్రతిభాపాటవ పోటీలు దోహదపడతాయని మున్సిపల్ కమిషనర్ పూడి రవిబాబు అన్నారు. బాలల దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి బాలల ప్రతిభాపాటవ పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర వహిస్తున్నారన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు, విద్యార్థుల్లో దాగి ఉన్న వివిధ కళలను వెలికి తీసేందుకు పీఆర్‌టీయూ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అనంతరం పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.గోపినాథ్ మాట్లాడుతూ ఖర్చుకు వెనుకాడకుండా ఏటా ఏటా బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు నవంబర్ 14న జరిగే బాలల దినోత్సవంలో బహుమతులు అందిస్తామన్నారు. చిత్రలేఖనం పోటీల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

వరి తెగుళ్లపై దిగులొద్దు

- రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు


అక్కాపేటలో వరి పంట తెగుళ్లను రైతులకు వివరిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త రాజ్‌కుమార్

సాక్షి, అనకాపల్లి: వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వరి పంటకు సోకే తెగుళ్లతో ఎటువంటి దిగులు చెందాల్సిన పనిలేదని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.రాజ్‌కుమార్ తెలిపారు. గురువారం చోడవరం, నర్సీపట్నం, పాయకరావుపేట నియోజకవర్గం పరిధిలోని రైతులకు క్షేత్ర స్థాయిలో ప్రస్తుత పరిస్థితుల కారణంగా వచ్చే తెగుళ్లపై అవగాహన కల్పించారు. సుడిదోమ నివారణకు వరి రేకులపై పచ్చపురుగు, పోటాషియం, ఎండు తెగుళ్ల వంటి వ్యాధులకు ఏయే రసాయనాలు వాడాలో సూచించారు. ఆకుచుట్టు పురుగు నివారణ మందులు పిచకారి చేయడానికి ముందుగా కొబ్బరి తాడును గట్లపై నుంచి పొలం మీదుగా లాగిన తర్వాత పిచికారీ చేసినట్లయితే మంచి ఫలితం ఉంటుందన్నారు. సుడిదోమ నివారణకు ఎకరాకు పైమెట్రోజైన్ 120 గ్రాముల ద్రవాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఆకుముడత నివారణ, పొటాషియం లోప నివారణకు పిచికారీ చేయాల్సిన మందులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు డాక్టర్ సౌజన్య, విస్తరణ శాస్త్రవేత్త ఎస్.కిశోర్ కుమార్, ప్రొగ్రాం కోఆర్డినేటర్ ఎన్.రాజ్‌కుమార్, రైతులు రెడ్డి అచ్చియ్యనాయుడు, బి.త్రినాథ్, బి.పండు తదితరులు పాల్గొన్నారు.

కాలినడకన శబరిమలైకి..

- 1,400 కి.మీ. పాదయాత్రకు సన్నద్ధం


గొల్లవిల్లి శ్రీను స్వామి


ఎం.కోడూరు నుంచి శబరిమలై యాత్రకు వెళ్తున్న గొల్లవిల్లి శ్రీను స్వామితో, స్థానిక స్వాములు

మాడుగుల రూరల్: హరి హర సుతుడు అయ్యప్పస్వామిని కాలి నడకన వెళ్లి దర్శించుకునేందుకు మండలంలోని ఎం.కోడూరుకు చెందిన గొల్లవిల్లి శ్రీను సంకల్పించుకున్నారు. ఈ మేరకు ఈ నెల 24న పలువురు స్వాములతో కలిసి తొలిసారిగా అయ్యప్ప మాలధారణ చేశారు. తన సంకల్పం మేరకు గ్రామం నుంచి కాలినడకన శబరిమలైకు బయలుదేరారు. ఈ కాలినడకలోనే ఆయన మండల దీక్ష పూర్తి చేయనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం స్వామి పూజలు పూర్తి చేసుకుని, బయలుదేరుతున్న ఆయనకు స్థానిక స్వాములు అభినందించి, యాత్ర దిగ్విజయం కావాలని దీవించారు. ఈ సందర్భంగా శ్రీను స్వామి సాక్షితో మాట్లాడుతూ ఎం.కోడూరు నుంచి శబరిమలై సుమారు 1,400 కి.మీ. దూరమని, రోజూ 30 నుంచి 40 కి.మీ. మేర నడుస్తూ యాత్ర పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ రాత్రి దారిలోని దేవాలయాల్లో సేదదీరి, వేకువజామునే స్నానపానాలు, పూజలు పూర్తి చేసి, నడక ప్రారంభిస్తానన్నారు. దీక్ష పూర్తయ్యాక ఏదో ఓ దేవాలయంలో ఇరుముడులు కట్టుకుని, స్వామి సన్నిధానానికి చేరుకుని మొక్కులు తీర్చుకోనున్నట్లు వెల్లడించారు. తొలి రోజు ఆయన ఎం.కోడూరు నుంచి సాగరం, ఘాట్‌రోడ్డు జంక్షన్ మీదుగా జంపెన, ఒమ్మలి, రావికమతం దాటి కొత్తకోటలో రాత్రి బస చేయనున్నట్లు పేర్కొన్నారు.

క్రెబ్స్ పరిశ్రమ కాలుష్యంపై ఆందోళన

- నమూనాలను సేకరించిన పీసీబీ అధికారులు


పరిశ్రమ ప్రతినిధులు, ఆందోళనకారులతో చర్చిస్తున్న సీఐ మోహన్, ఎస్‌ఐ ఆదినారాయణరెడ్డి


క్రెబ్స్ పరిశ్రమలో కలుషిత నీటి నమూనాలు సేకరిస్తున్న పీసీబీ అధికారులు

కశింకోట: మండలంలోని తేగాడ వద్ద ఉన్న క్రెబ్స్ బయో కెమికల్ ప్రైవేటు పరిశ్రమలో కాలుష్యాన్ని నివారించాలని కోరుతూ రెండు గ్రామాల ప్రజలు గురువారం ధర్నా నిర్వహించారు. దీంతో విశాఖ ప్రాంతీయ కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) ఇంజినీర్ జి.నాగిరెడ్డి సాయంత్రం పరిశ్రమను సందర్శించారు. కలుషిత వ్యర్థ జాలాల నమూనాలు పదింటిని సేకరించారు. పేరంటాలపాలెం, గంటవానిపాలెం ప్రాథమిక పాఠశాలల బోర్లతోపాటు ఒక ఇంట్లో ఉన్న బోరు నుంచి నీటి నమూనాలను తీసుకున్నారు.

పరిశ్రమ కాలుష్యంతో అనారోగ్యం

క్రెబ్స్ పరిశ్రమ వ్యర్థాలకు వ్యతిరేకంగా పరిశ్రమ ప్రవేశ ద్వారం వద్ద పేరంటాలపాలెం, గంటవానిపాలెం గ్రామాలకు చెందిన ప్రజలు, యువకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పేరంటాలపాలెం ఉప సర్పంచ్ వజ్రం శ్రీనివాసరావు, స్థానికులు కోట సుబ్రహ్మణ్యం, సేనాపతి సాయి కిరణ్(గంటవానిపాలెం) తదితరులు మాట్లాడుతూ పరిశ్రమకు చెందిన కలుషితాలను భూగర్భంలో విడిచిపెడుతుండటంతో తమ గ్రామాల్లోని బోర్ల నీరు కలుషితమై అనారోగ్యాలకు గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నీటిని వినియోగించలేక, దూరంగా ఉన్న వెదురుపర్తి, జోగారావుపేట గ్రామాల నుంచి నీటిని తెచ్చుకుని తాగుతున్నట్లు వాపోయారు. రాత్రి వేళ పరిశ్రమ నుంచి వస్తున్న పొగ దుర్వాసన భరించలేకపోతున్నామన్నారు. సమస్యను జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, కాలుష్య నియంత్రణ మండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

వారంలో నివేదిక

తాము సేకరించిన నమూనాలను ల్యాబ్‌కు పంపి, విశ్లేషించనున్నట్లు పీసీబీ ఇంజినీర్ నాగిరెడ్డి మీడియాకు తెలిపారు. 13 నమూనాలను సేకరించామన్నారు. వీటి నివేదిక రావడానికి వారం రోజులు వ్యవధి పడుతుందని, నివేదిక వచ్చిన తర్వాత ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. దీని ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయన్నారు. కాలుష్యం కారణంగా గతంలో పరిశ్రమ మూత పడిందన్నారు. ఆ తర్వాత వాటిని సరి చేయడంతో అనుమతి వచ్చి, మళ్లీ పరిశ్రమను తెరిచినట్లు పేర్కొన్నారు. మళ్లీ దీని కాలుష్యంపై ఫిర్యాదు వచ్చిందన్నారు. దీంతో ఏఈ వచ్చి పరిశీలించిన మీదట నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. అనకాపల్లి సీఐ డి.మోహన్, ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తమ సిబ్బందితో వచ్చి, శాంతి భద్రతలను పర్యవేక్షించారు.

అటవీ భూముల ఆక్రమణపై కేసులు

ఎస్.రాయవరం: అటవీ శాఖ భూముల ఆక్రమణదారులపై ఎట్టకేలకు యలమంచిలి అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. మండలంలోని రేవుపోలవరం గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు అటవీ భూమిని చదును చేసేందుకు ప్రయత్నిస్తుండగా, సమాచారం తెలుసుకున్న ఫారెస్టు అధికారులు ఎస్.రాయవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసులు నమోదు చేసినట్టు ఎస్‌ఐ ప్రసాద్‌రావు తెలిపారు.

ఆర్టీసీకి రూ.40 లక్షల ఆదాయం

అనకాపల్లి టౌన్: దసరా పండగను పురస్కరించుకుని ఈ ఏడాది ప్రత్యేక సర్వీసుల ద్వారా రూ.40 లక్షల ఆదాయం వచ్చినట్లు ప్రజా రవాణాశాఖ (ఆర్టీసీ) అధికారి కె.పద్మావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం డిపోల నుంచి విజయవాడకు ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు నడిపిన 80 ప్రత్యేక సర్వీసుల ద్వారా ఈ ఆదాయం సమకూరినట్టు ఆమె చెప్పారు.

క్లుప్తంగా

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



ఆలయంలో పూజ చేస్తున్న ఆళ్ల నాగేశ్వరరావు దంపతులు

అనకాపల్లిటౌన్: ఆధ్యాత్మిక చింతన ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని భోగలింగేశ్వరస్వామి ఆలయ చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు అన్నారు. ఆలయ ఆవరణలోని జమ్మిచెట్టు వద్ద గురువారం ఆయన భార్యతోపాటు, వైద్యులు వి.బెనర్జీ దంపతులు శమీపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలన్నారు. దైనందిన ఒత్తిళ్ల నుంచి బయటపడేందుకు ఆధ్యాత్మిక చింతన ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నగదు రహిత పన్ను చెల్లింపులు షురూ



ఉడ్‌పేట సచివాలయ అడ్మిన్ గణేష్‌కు పీవోఎస్ మిషన్‌ను అందిస్తున్న జెడ్సీ వెంకటరమణ

అనకాపల్లిటౌన్: పన్నులు చెల్లించేందుకు నగదు రహిత లావాదేవీలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు జోనల్ కమిషనర్ ఎస్.వెంకటరమణ తెలిపారు. జీవీఎంసీ అనకాపల్లి జోన్ కార్యాలయంలో గురువారం జోన్ పరిధిలోని 27 సచివాలయాల అడ్మిన్లకు పీవోఎస్ యంత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకపై ఇంటి, కుళాయి, ఖాళీ స్థల పన్నులు చెల్లించే వారు ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం, ఇతర యూపీఐ పేమెంట్లు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో సచివాలయాల అడ్మిన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాల బ్రోచర్‌ను గురువారం ఆవిష్కరిస్తున్న ప్రజారవాణా శాఖ అధికారులు అప్పలనాయుడు, పద్మావతి, సుజాత తదితరులు. మాసోత్సవాలు వచ్చే నెల 25 వరకు జరగనున్నాయి. - తుమ్మపాల

అనకాపల్లి సినిమాలు

టైగర్ నాగేశ్వరరావు	: రాజా
లియో	:సత్యనారాయణస్క్రీన్-1
చిన్నా	:సత్యనారాయణస్క్రీన్-2
భగవంత్ కేసరి	: షిర్డిసాయి
టైగర్ నాగేశ్వరరావు	: పర్తిసాయి
గణపథ్(తెలుగు)	: వెంకటేశ్వర
ఓటు చాలా విలువైనది (ఉ॥ మ॥)	
ధీమహా (ఫస్ట్ షో, సెకండ్ షో)	: శ్రీసత్య
భగవంత్ కేసరి	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 969 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	3,760	4,450
రెండో రకం	3,500	4,060
మూడోరకం	3,310	3,520

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 34 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9 యూనిట్లు, ఏ నెగిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-6 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-13 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 452 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 368 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

పట్టణం.. సర్వాంగ సుందరం!

జిల్లా కేంద్రం అనకాపల్లి పట్టణ రూపురేఖలు మారుతున్నాయి. ఇరుకు రోడ్లు విస్తరణకు నోచుకుంటున్నాయి. స్ట్రీట్ లైట్లు, పర్యావరణ హిత మొక్కలతో డివైడర్లు అందంగా మారుతున్నాయి. పటిష్ట డ్రైనేజీ వ్యవస్థ ఏర్పడుతోంది. కొత్తగా ఏర్పడిన జిల్లా కేంద్రంలో మౌలికవసతుల కల్పన శరవేగంగా జరుగుతోంది.

- జిల్లా ప్రధాన కేంద్రంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు
- రూ.12.10 కోట్లతో రోడ్లు, డ్రైనేజీలు, మొక్కల ఏర్పాటు





సిద్ధమవుతున్న జీవీఎంసీ విలీన గ్రామం కొత్తూరు-రాజుపాలెం రహదారి (ఇన్‌సెట్) పట్టణంలో శారదానది బ్రిడ్జి వద్ద డివైడర్లను తొలగిస్తున్న దృశ్యం

అనకాపల్లిటౌన్: అనకాపల్లి జిల్లా ప్రధాన కేంద్రమైన పట్టణ ముఖ చిత్రం మారబోతోంది. కొత్త జిల్లాగా ఏర్పడినప్పటి నుంచి దశలవారీగా అభివృద్ధి పనులను ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జిల్లా కేంద్రానికి కావాల్సిన అన్నిరకాల మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నారు. పట్టణంలో ప్రధాన రహదారులు, సెంట్రల్ లైటింగ్, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధికి రూ.12.10 కోట్ల నిధులతో పనులు ప్రారంభించారు. వీధి దీపాల ఏర్పాటు, పర్యావరణాన్ని కాపాడేందుకు రోడ్లకు ఇరువైపులా మొక్కలు, ద్విచక్ర వాహనదారులకు పార్కింగ్ వసతి తదితర ఏర్పాట్లు చేస్తున్నారు.

- జలగలమదుం(వై) జంక్షన్ నుంచి సూర్యనారాయణమూర్తి ఆలయం వరకు రహదారి సుమారు ఒకటిన్నర కిలోమీటరు మాత్రమే. విశాఖ నుంచి అనకాపల్లి వచ్చే వాహనాలు ఎక్కువగా రాకపోకలు సాగించే రహదారి కావడంతో వర్షా కాలం వస్తే చాలు.. రోడ్డు గోతులమయం కాక తప్పదు. ఈ రోడ్డు వెడల్పు కొన్ని చోట్ల 11 నుంచి 16 అడుగులు మాత్రమే. దీంతో రోడ్డును రూ.3.37 కోట్లతో 90 అడుగుల వెడల్పున విస్తరించే పనులు చేపట్టారు. ఇప్పటికే పనులు పూర్తయ్యాయి. రహదారికి అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించారు. సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టారు. రహదారిపై వర్షపు నీరు నిలిచిపోకుండా డ్రైనేజీలను అభివృద్ధి చేశారు.
- సుంకరమెట్ట జంక్షన్ నుంచి శారదానది బ్రిడ్జి వరకూ 2 కిలోమీటర్ల రహదారి విస్తరణ పనులకు రూ.3.43 కోట్లు నిధులు కేటాయించారు. ప్రస్తుతం రహదారి మధ్యలో శిథిలావస్థకు చేరుకున్న డివైడర్ తొలగించి, కొత్త డివైడర్ ఏర్పాటు చేస్తున్నారు. డివైడర్ మధ్యలో మొక్కలను నాటేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. రహదారికి ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేసి, పాదచారులు నడిచేందుకు వీలుగా డ్రైనేజీపై సిమెంట్ పలకలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాన రహదారి కావడంతో వాహనదారులు పార్కింగ్ చేసుకునేందుకు వీలుగా మార్కింగ్, వీధి లైట్ల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి.
- నెహ్రూచౌక్ నుంచి గుండాల జంక్షన్ వరకూ 2 కి.మీ. రహదారి అభివృద్ధికి రూ.కోటీ 40 లక్షల నిధులు మంజూరయ్యాయి. రోడ్డు విస్తరణకు ఆటంకంగా ఉన్న 40 విద్యుత్ స్తంభాలను తొలగించి, పక్కగా ఏర్పాటు చేసేందుకు విద్యుత్ శాఖ సిబ్బందికి ఇప్పటికే జోనల్ అధికారులు తెలిపారు. డ్రైనేజీపై సిమెంట్ పలకలు ఏర్పాటు చేసి, ప్రస్తుతం ఉన్న రోడ్డును స్థానిక అవసరాలకు అనుగుణంగా విస్తరించనున్నారు.
- బెల్లంమార్కెట్(రింగ్‌రోడ్డు) కోల్డ్ స్టోరేజ్ నుంచి రైల్వే స్టేషన్ రహదారి చాలా వరకు శిథిలావస్థకు చేరుకుంది. దీంతో 1.5 కిలో మీటర్ల మేర ఈ రోడ్డు పునరుద్ధరణకు రూ.90 లక్షల నిధులు మంజూరయ్యాయి. వీటితో ఇప్పటికే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. గోతుల్ని పూడ్చి, అదనంగా మరో లేయర్ తారు రోడ్డు వేసేందుకు చర్యలు చేపట్టారు.
- కొత్తూరు జంక్షన్ నుంచి రాజుపాలెం సూర్యనారాయణమూర్తి దేవాలయం వరకు 3 కిలో మీటర్ల రహదారిని రూ.3 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు. ఈ రహదారి మీదుగా వల్లూరు, ఎరుకువానిపాలెం ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. రాజుపాలెం మీదుగా మునగపాక మండలానికి వెళ్లే రహదారినీ అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం రెండున్నర మీటర్లు వెడల్పున ఉన్న కొత్తూరు-రాజుపాలెం రోడ్డును నాలుగున్నర మీటర్ల వెడల్పున విస్తరించనున్నారు. మొత్తం అభివృద్ధి పనులు రెండు మాసాల్లో పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

పట్టణానికి మరింత అందం



రోడ్లు అభివృద్ధి చెందితే.. పట్టణం మరింత అందంగా మారుతుంది. ప్రధాన రహదారులు, జీవీఎంసీ విలీన గ్రామం రాజుపాలెం రహదారి అభివృద్ధికి రూ.12.10 కోట్లు మంజూరయ్యాయి. నెల రోజుల క్రితం పనులను ప్రారంభించాం. ప్రస్తుతం పనులు జోరందుకున్నాయి. రహదారుల నిర్మాణానికి ఆటంకంగా ఉన్న దుకాణాలు, బడ్డీలను తొలగించాలని సిబ్బందిని ఆదేశించాం. ప్రజలు, వ్యాపారులు కూడా పట్టణ అభివృద్ధికి సహకరించాలి.

– ఎస్.వెంకటరమణ, జెడ్సీ, అనకాపల్లి జోన్

చల్లంగ చూడమ్మా.. సత్యమాంబ



సత్యమాంబ సన్నిధిలో మొక్కుకుంటున్న భక్తులు



అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న మహిళలు

- పిసినికాడలో వైభవంగా సత్యమాంబ జాతర

అనకాపల్లి రూరల్: అమ్మా.. కరుణించి కాపాడమ్మా.. కష్టం మా దరి చేరకుండా చూడాలమ్మా.. అంటూ భక్తులు సత్యమాంబను వేడుకున్నారు. మండలంలోని పిసినికాడలో గురువారం సత్యమాంబ అమ్మవారి జాతర వైభవంగా జరిగింది. గ్రామ పొలిమేరలో సుమారు 150 సంవత్సరాలకు పైగా వయసున్న మర్రి, వేప చెట్లను భక్తులు అమ్మవారి రూపంగా భావించి పూజలు చేస్తారు. ఏటా దసరా పండగ తర్వాత వచ్చే మొదటి గురువారం రోజున సత్యమాంబ జాతరను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించడం ఆనవాయితీ. భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా అమ్మవారిని గ్రామస్తులు కొలుస్తారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయం వద్దకు ఉదయం నుంచే పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు చీర, రవిక, గాజులు, నల్ల పూసలు పెట్టి పూజలు చేశారు. అనకాపల్లి పట్టణం, కశింకోట, కొత్తూరు ప్రాంతాల నుంచే కాకుండా బంధుమిత్రులు గ్రామానికి చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది. సాయంత్రం గ్రామానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో ఘటాలను తలపై మోస్తూ గ్రామంలోని వీధుల్లో ఊరేగింపుగా వెళ్తూ హైవే పక్కనున్న అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. డప్పులు, చిడతలు, చెక్క భజనలు, కోలాటాలతో ఘటాల ఊరేగింపు కోలాహలంగా జరిగింది. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. రాత్రి గ్రామంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సర్పంచ్ యల్లపు రమేష్, ఆలయ కమిటీ చైర్మన్ మళ్ల వెంకట్రావు, మళ్ల పూర్ణ, సూరి గణేష్, దాడి రామత్రినాథ్, మళ్ల బాల శ్రీను, రాజగిరి కోటి, దాడి బాల, దాడి రాము, మళ్ల అప్పారావు, శరగడం ప్రసాద్ తదితర గ్రామ పెద్దలు జాతరను పర్యవేక్షించారు.

ఘనంగా మరిడిమాంబ ఉత్సవం



కశింకోట గవరపేటలో మరిడిమాంబ అమ్మవారు



దాడి రత్నాకర్‌ను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

కశింకోట: కశింకోటలో గురువారం రాత్రి మరిడిమాంబ ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్థానిక గవరపేటలోని కనక మహాలక్ష్మి వీధి, కస్పావీధి, కాశీభట్ల వీధుల్లో ఉన్న మరిడిమాంబ ఆలయాలను భక్తులు సందర్శించి, అమ్మవారికి పూజలు చేశారు. చీరలు, రవికెలు, అరటి గెలలు తదితర రూపాల్లో మొక్కులు తీర్చుకున్నారు. గవరపేటలోని మరిడిమాంబ ఆలయాన్ని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ దర్శించుకుని, పూజలు చేశారు. ఆలయ కమిటీ తరఫున దుశ్శాలువా కప్పి, జ్ఞాపికతో ఆయన్ని సత్కరించారు. ఆలయాలను ఉత్సవం సందర్భంగా విద్యుద్దీపాలతో అలంకరించారు. బాణసంచా కాల్చారు. సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు వేగి దొరబాబు, ఆలయ కమిటీ అధ్యక్షుడు భీశెట్టి కుమార్, ఉపాధ్యక్షుడు వేగి సన్యాసినాయుడు, సభ్యులు కాండ్రేగుల నాగేష్, దాడి రాము, ఆడారి స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందూ ధర్మ ప్రచార వారోత్సవాలు



నూకాంబిక అమ్మవారి బాలాలయంలో భరతనాట్యం చేస్తున్న చిన్నారులు



భరతనాట్య ప్రదర్శన బృందంతో ఆలయ చైర్మన్ మురళీకృష్ణ, కమిటీ సభ్యులు

అనకాపల్లిటౌన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు హిందూ ధర్మ ప్రచార వారోత్సవాలను ఈ నెల 22 నుంచి 28 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి బాలాలయం ఆవరణలో భరత నాట్య ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా ఇప్పటి వరకు సప్తాభారతి భాగవతారిణిచే హరికథ, రేజేటి చక్రవర్తి ఆచార్యులచే ప్రవచనములు, కొణతాల బోసు బృందంచే భక్తి సంగీతాలు, శ్రీ వెంకట సాయి డాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ, కాళ్లకూరి సుజాత బృందం వారిచే భరతనాట్య ప్రదర్శనలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. శుక్ర, శనివారాలు పోతురాజు సిండికేట్ ఆధ్వర్యంలో భజన సంకీర్తనలు, పెతకంశెట్టి సుజాతనాయుడు ఆధ్వర్యంలో శ్రీ నూకాంబిక అమృతవర్షిణి బృందంచే కోలాటాలు, గౌరీప రమేశ్వరి మహిళా బృందం వారిచే లలితా స్తోత్ర పారాయణం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

బోగస్ డ్వాక్రా గ్రూపు దోపిడీపై చర్యలు తీసుకోవాలి

తుమ్మపాల: మండలంలో సత్యనారయణపురం గ్రామంలో బోగస్ డ్వాక్రా గ్రూప్ ఏర్పాటుచేసి భారీగా సొమ్మును కాజేసిన వెలుగు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద మహిళలు నిరసన తెలిపారు. మహిళల వివరాలను సేకరించి వారికి తెలియకుండా రుణం తీసుకుని, కాజేశారని సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ ఆరోపించారు. ఒక్కో గ్రూప్ నుంచి రూ.15 లక్షల చొప్పున మొత్తం 6 గ్రూపుల నుంచి నగదును నొక్కేసినట్లు పేర్కొన్నారు. ముద్ర రుణాలను కూడా వీరు అడ్డగోలుగా కాజేశారని పేర్కొన్నారు. ఇందుకు బాధ్యులైన వెలుగు సిబ్బందిపై విచారణ చేపట్టి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుమ్మపాల: పట్టణంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు డీ-1 సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ స్తంభాలు, లైన్ల మార్పులు, మరమ్మతులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. దీంతో గుండాల జంక్షన్ నుంచి నెహ్రూ చౌక్ వరకు ఉన్న అంజయ్యకాలనీ, గాంధీనగరం, శ్రీరామ్‌నగర్, న్యూ బర్మా కాలనీ, లెప్రసీ కాలనీ, లక్ష్మీదేవిపేట, మిర్యాల కాలనీ, విజయరామరాజుపేట, ఏఎంసీ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. ఈ విషయాన్ని గమనించి, సహకరించాల్సిందిగా ప్రజలను కోరారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

అనకాపల్లిటౌన్: జీవీఎంసీ విలీనగ్రామం సిరసపల్లి యూపీహెచ్‌సీలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ సుర వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో రక్తపరీక్షలు చేయించుకుని, టోకెన్లు పొందిన వారితోపాటు స్పాట్ రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు కూడా వైద్యసేవలు పొందవచ్చన్నారు. వైద్యశిబిరానికి నలుగురు స్పెషలిస్టు వైద్యులు హాజరై, రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు అందిస్తారని పేర్కొన్నారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి ఆరోగ్య శ్రీ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించి, ఉచితంగా చికిత్స అందిస్తామన్నారు. కంటిచూపు సమస్యలున్న వారికి ప్రత్యేకంగా కంటి పరీక్షలు నిర్వహించి, శస్త్రచికిత్సలకు సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు.

కశింకోట: మండలంలోని తీడ సచివాలయంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు జగనన్న ఆరోగ్య సురక్ష చివరి వైద్య శిబిరం జరగనుందని ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో వి.వి.రవికుమార్ గురువారం తెలిపారు. శిబిరంలో ప్రత్యేక వైద్య నిపుణులు, పీహెచ్‌సీ వైద్యులు పాల్గొని, రోగుల్ని పరీక్షించి, ఉచితంగా మందులు అందిస్తారన్నారు. రెడ్డివానిపాలెం, కచ్చర్లపాలెం, పాత కన్నూరుపాలెం, చెరకాం తదితర గ్రామస్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా కోరారు.

మరో అన్నవరంగా సుంకరమెట్ట సత్యదేవుని ఆలయం



ఆలయ ఆవరణలో పిచ్చిమొక్కల్ని పరిశీలిస్తున్న చైర్మన్ నాయుడు, పాలకవర్గ సభ్యులు

అనకాపల్లిటౌన్: మరో అన్నవరంగా సుంకరమెట్ట సత్యనారాయణస్వామి ఆలయాన్ని తీర్చిదిద్దుతానని ఆలయ చైర్మన్ కె.ఎం.నాయుడు అన్నారు. ఆలయ ఆవరణలో గురువారం ప్రహరీగోడ నిర్మాణ స్థలాన్ని పాలకవర్గ సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశలవారీగా ఆలయ అభివృద్ధికి శ్రీకారం చుడుతున్నామన్నారు. ఆలయ ఆవరణాన్ని హరితవనంగా తీర్చిదిద్దనున్నట్లు పేర్కొన్నారు. ఫర్నిచర్ సౌకర్యంతోపాటు రానున్న కార్తీకమాసంలో భక్తులకు వీలుగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తయారు చేయనున్నట్లు తెలిపారు. అంతకుముందు ఆలయ ఆవరణలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలను జేసీబీ సాయంతో తొలగించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ క్వారీ కార్మికుడి మృతి

అనకాపల్లిటౌన్: తీవ్రంగా గాయపడిన క్వారీ కార్మికుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. గ్రామీణ ఎస్ఐ సీహెచ్ నర్సింగరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. బుచ్చెయ్యపేట మండలం ఆర్.భీమవరం గ్రామానికి చెందిన రొంగలి అప్పలనాయుడు(62) మండలంలోని కూండ్రం గ్రామంలో శ్రీ లక్ష్మీనర్సింహ స్టోన్‌క్రషర్స్‌లో పని చేస్తున్నాడు. ఈ నెల 23న సాయంత్రం 4 గంటల సమయంలో క్వారీలో ఒక యంత్రం ఆగిపోవడంతో అప్పలనాయుడుతోపాటు మరో కార్మికుడు శ్రీనివాసరావు ఆ యంత్రాన్ని తిప్పేందుకు ప్రయత్నించారు. ఒక్కసారిగా యంత్రం తిరగడంతో ఇద్దరు కార్మికులు కిందపడిపోయారు. ఈ ప్రమాదంలో అప్పలనాయుడి తలకు బలమైన గాయమైంది. శ్రీనివాసరావు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. క్షతగాత్రుడ్ని స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో చేర్చగా, మెరుగైన చికిత్స కోసం విశాఖకు తరలించారు.

అక్కడ చికిత్స పొందుతూ అప్పలనాయుడు మృతి చెందినట్లు ఎస్ఐ వెల్లడించారు. మృతుని కుమారుడు నాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాడి రైతులకు అమూల్ నగదు ప్రోత్సాహకం

కశింకోట: జగనన్న పాల వెల్లువలో భాగస్వాములైన 256 మంది పాడి రైతులకు అమూల్ సహకార సంఘం ద్వారా రూ.3.78 లక్షలు నగదు ప్రోత్సాహకాన్ని అందించినట్లు నరసింగబిల్లి పశు వైద్యాధికారి చైతన్యమణి గురువారం తెలిపారు. గత ఏడాది మే 20 నుంచి ఈ ఏడాది మార్చి నెలాఖరు వరకు 182 రోజులు పైబడి పాలు సరఫరా చేసిన రైతులకు లీటరుకు 50 పైసలు వంతున నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు పేర్కొన్నారు. డెయిరీలను బలోపేతం చేసే లక్ష్యంతో అంతర్జాతీయంగా పేరున్న అమూల్‌తో ప్రభుత్వం జగనన్న పాల వెల్లువ పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. దీనిలో భాగంగా అమూల్ కేంద్రాలకు పాలు పోస్తున్న రైతులకు నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తోందన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష

- వైద్య శిబిరాలకు పోటెత్తుతున్న జనాలు
- ఉచిత వైద్య పరీక్షలు, మందులపై ఆనందం



పౌష్టికాహార ప్రదర్శనను తిలకిస్తున్న భీశెట్టి వరాహసత్యవతి, గొర్లి సూరిబాబు



కన్నూరుపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో స్పాట్ రిజిస్ట్రేషన్



వైద్యులు అందిస్తున్న సేవలు పరిశీలిస్తున్న దిలీప్‌కుమార్

అనకాపల్లిటౌన్: పేదలకు వరం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహసత్యవతి, ఎంపీపీ గొర్లి సూరిబాబులు అన్నారు. మండలంలోని కోడూరు ప్రభుత్వ పాఠశాల ఆవరణలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చిన తరువాత గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య సంరక్షణను పట్టించుకున్న ఏకైక ప్రభుత్వం ఇదేనని కొనియాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అత్యుత్తమ వైద్యసేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. గతంలో ఏ చిన్న అనారోగ్యం వచ్చినా పట్టణాలకు ప్రజలు పరుగులు తీసేవారని, ప్రస్తుతం గ్రామాల్లోనే అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి రావడం చూస్తున్నామన్నారు. పల్లెచెంతకే పలు ప్రభుత్వ సేవల్ని తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసే బాధ్యత మనందరిపై ఉందన్నారు. అన్నివర్గాలకు మేలు చేసేలా సీఎం జగన్ సుపరిపాలన సాగుతోందన్నారు. అంతకు ముందు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో సర్పంచ్ సేనాపతి లక్ష్మీశ్రీనివాస్, ఎంపీటీసీ కొండ అర్జున అచ్చియ్యమ్మ, వైస్ సర్పంచ్ కశిరెడ్డి పైడిరాజు, స్కూల్ కమిటీ చైర్మన్ వనం ప్రసాద్, ఎంపీడీవో కె.నరసింహారావు, ఎంఈవో చిట్టిబాబు, ఈవోఆర్డీ ధర్మారావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, వైద్యులు, ఆశ వర్కర్లు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెం(ఈ.చౌడువాడ) సచివాలయంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష జనాదరణ లభించింది. 575 మంది వైద్య సేవలు పొందారు. వీరిలో 88 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 21 మందికి కేటరాక్టు ఆపరేషన్లు, 56 మందిని కళ్లద్దాలకు సిఫార్స్ చేశారు. ప్రత్యేక వైద్య నిపుణులు లిల్లీ, రవితేజ, అనిల్, యు.రమేష్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. రక్త పరీక్షలు, ఈసీజీ, బీపీ, సుగర్ పరీక్షలు జరిపారు. శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ మెరుగైన ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం సురక్ష వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తోందన్నారు. వీటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజుతో కలిసి శిబిరంలో ఏర్పాటు చేసిన పలు విభాగాలను పరిశీలించారు. వైద్యులు అందిస్తున్న సేవలను, అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార పదార్థాల స్టాల్, ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటల ఉత్పత్తులు, జగనన్న గోరుముద్ద వంట పదార్థాల ప్రదర్శన ఆకట్టుకుంది. స్పాట్ రిజిస్ట్రేషన్, ఇంటింటి సర్వే రిజిస్ట్రేషన్ విభాగాలను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా ప్రోగ్రాం అధికారి జగదీష్, ఎంపీడీవో వి.వి.రవికుమార్, పంచాయతీ కార్యదర్శి సత్యారావు, సర్పంచ్ శివ, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యాశాఖ ఏర్పాటు చేసిన జగనన్న గోరుముద్ద పౌష్టికాహార ప్రదర్శన



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనను తిలకిస్తున్న శ్రీధర్‌రాజు